సాక్షి వికారాబాద్

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



అక్షరాలు నేర్చుకునేదెలా?
నిరక్షరాస్యతను నిర్మూలించాలనే ఉద్దేశంతో జిల్లాలో ఏర్పాటు చేసిన సాక్షరభారత్ కేంద్రాలు మూతపడ్డాయి. 10లో▸



'తపాలా' వడ్డీ పెరిగింది
తపాలా శాఖ నిర్వహిస్తున్న పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు పెంచింది. ఖాతాదారులకు ప్రయోజనం చేకూరనుంది. 10లో▸



14 ఏళ్లుగా ఎదురుచూపులే
ఉమ్మడి ఏపీలో గిరిజన సంక్షేమ శాఖ నిధులతో చేపట్టిన వంతెన పనులు 14 సంవత్సరాలు గడుస్తున్నా పూర్తికావడం లేదు. 11లో▸



న్యూస్‌రీల్

జాతీయ అవార్డుకు చీమల్‌దరి ఎంపిక

గుడ్‌గవర్నెన్స్‌ విభాగంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా సెలెక్ట్



మోమిన్‌పేటలోని చీమల్‌దరి గ్రామం

మోమిన్‌పేట: జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీగా చీమల్‌దరి ఎంపికైంది. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర ఉత్తమ జీపీగా అవార్డు అందుకున్న ఈ గ్రామం జాతీయ అవార్డుకు సెలెక్ట్ కావడంపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితారెడ్డి చేతుల మీదుగా ఇటీవలే రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న గ్రామ సర్పంచ్ నాసన్‌పల్లి నర్సింహారెడ్డి, కార్యదర్శి సుగుణ మరో పురస్కారం తీసుకోనున్నారు. గుడ్ గవర్నెన్స్ విభాగంలో జాతీయ స్థాయి బెస్ట్ జీపీగా ఎంపికైన సందర్భంగా ఎంపీపీ వసంతవెంకట్, అధికారులు గ్రామ ప్రజలు, సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. త్వరలోనే దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

బొంరాస్‌పేట: మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు వరుసగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం రాత్రి మండల పరిధిలోని దుప్‌చర్ల శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

ముగిసిన బాలాజీ బ్రహ్మోత్సవాలు



గండిపేట చెరువులో చక్రస్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

మొయినాబాద్: ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన బాలాజీ బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రస్నానంతో ముగిశాయి. స్వామివారికి సర్వసైన్యాధిపతి అయిన చక్రస్వామి ఆధ్వర్యంలో చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలోని హోమగుండాల గదిలో పూర్ణహుతి చేపట్టారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్టదిక్పాలకులకు నైవేద్యంగా పెట్టి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అద్దాలపల్లకిలో ఆసీనులను చేసి అలంకరించారు. అనంతరం చక్రస్వామి, నవపాలికలు, స్వామివారిని పల్లకిలో దేవాలయం చుట్టూ ఊరేగించారు. శివాలయం పక్కనే ఉన్న మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజతో దేవ్వళ్లందరినీ ఆవాహనం చేసి సుగంధద్రవ్యాలతో నవకలశ అభిషేకం చేశారు. తరువాత చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట చెరువులోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ చక్రతీర్థాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, నరసింహన్, బాలాజీ, కిట్టు, మురళి, కన్నయ్య, సురేశ్, అనిల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టం

టెన్త్ పేపర్ అవుట్ నేపథ్యంలో పకడ్బందీ చర్యలు

- జిల్లాలోని 74 సెంటర్ల వద్ద పటిష్ట బందోబస్తు
- విధుల్లో పాల్గొంటున్న అన్ని శాఖలు అప్రమత్తం
- తనిఖీలకు ఎవరు వచ్చినా.. కాంపౌండ్ బయటే సెల్‌ఫోన్లు



వికారాబాద్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని సెంటర్ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అన్ని కేంద్రాల వద్ద ప్రస్తుతం హై అలర్ట్ కనిపిస్తోంది. వార్షిక పరీక్షల తొలి రోజునే తాండూరులో తెలుగు పేపర్ అవుట్ కావడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారులు టాప్ టు బాటమ్ అప్రమత్తమయ్యారు. పరీక్షల నిర్వహణలో పాలుపంచుకుంటున్న అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. గతంతో పోలిస్తే పోలీసు బందోబస్తును సైతం రెండింతలు పెంచారు. విద్యా శాఖ మంత్రి సబితారెడ్డి సొంత ప్రాంతం కావటంతో ఇక్కడ పేపర్ బయటకు రావడం ఇటు ప్రభుత్వానికి అటు విద్యా శాఖకు ఇబ్బందికరంగా మారింది. పేపర్ అవుట్‌లో ప్రధాన భూమిక పోషించిన ఇద్దరు ఉపాధ్యాయులను సర్వీసు నుంచి తొలగించడంతో పాటు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన మరో ఇద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. పైనుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఒకరిద్దరి కారణంగా జిల్లా పరువు పోయిందంటూ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.

అందరికీ ఒకే రూల్

తెలుగు పేపర్ లీకేజీ తర్వాత మరోసారి అలాంటి ఘటనలు జరగకుండా జిల్లాలోని 74 పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పెంచారు. ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, విధుల్లో పాల్గొనే ఏఎస్‌ఎంలు, ఇతర ఉద్యోగులందరూ తమ సెల్ ఫోన్లను ఇళ్ల వద్దే పెట్టి వెళ్లేలా ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సెంటర్ల వద్ద డ్యూటీ చేసే ఏఎస్‌ఎంలకు జియో అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చారు. డీఈఓ మొదలుకుని సెంటర్లను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో పాటు ఇంకెవరైనా సరే ఎగ్జామ్ సెంటర్ ఆవరణలోకి సెల్‌ఫోన్లు తేవద్దని ఆదేశించారు. పర్యవేక్షణ, తనిఖీల కోసం వెళ్తున్న అధికారులు హడావుడిలో మర్చిపోయి ఫోన్లు తీసుకెళ్లినా అక్కడున్న చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసులు సెల్ ఫోన్లను అనుమతించడం లేదు. చాలా సందర్భాల్లో తమ పైస్థాయి అధికారి సెల్ ఫోన్‌తో వచ్చినా సరే.. కింది స్థాయి సిబ్బంది ఆపేస్తున్నారు.

విద్యార్థుల్లో ఆందోళన

పేపర్ లీకేజీలతో విద్యార్థుల్లో కొంత ఆందోళన కనిపిస్తోంది. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో పాటు కలెక్టర్ మొదలుకుని, డీఈఓ, ఎంఈఓలు, తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, ఎంపీడీఓలు, ఎంపీఈఓలు సెంటర్లను తనిఖీ చేస్తున్నారు. దీంతో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు కొంత ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకు పరీక్ష హాల్‌లోకి వెళ్లే విద్యార్థులను పీఈటీలు, ఉపాధ్యాయులు మాత్రమే తనిఖీ చేసి పంపించేవారు. ప్రస్తుతం పోలీసులు కూడా చెక్ చేస్తుండటంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన కనిపిస్తోంది. భద్రత, బందోబస్తు చర్యలను స్వాగతించాల్సినప్పటికీ.. ఒకరి తర్వాత ఒకరు వచ్చి డిస్టర్బ్ చేయడంపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. పరీక్షలను స్ట్రిక్ట్‌గా అమలు చేస్తుండటంతో ఇన్విజిలేషన్ డ్యూటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కొంత ఆందోళనకు గురవుతున్నారు.



పత్తి ధర రూ.8 వేలు

- మరికొద్ది రోజులు వేచి చూడాలనే ధోరణిలో రైతులు
- ఇళ్లలోనే తెల్లబంగారం నిల్వలు

పెద్దేముల్: పత్తి ధర కాస్త పెరిగింది. పది రోజుల క్రితం రూ.7,300– రూ.7,400 పలికిన ధర.. శుక్రవారం రూ.7,950– రూ.8 వేలకు ఎగబాకింది. దీంతో ఇప్పటి వరకూ పంట విక్రయించని రైతులు కొంత ఊరట చెందుతున్నారు. మరికొంత మంది రూ.8 వేలకు కూడా అమ్మాలా.. వద్దా..? అనే ఊగిసలాటలో ఉన్నారు. గతేడాది మే, జూన్ నెలల్లో రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పలికింది. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజులు వేచి చూద్దామనే ధోరణిలో ఉన్నారు. వ్యాపారులు మాత్రం మద్దతు ధర వచ్చినప్పుడే అమ్ముకోవడం మేలని సూచిస్తున్నారు. ఏదిఏమైనా క్వింటాలుకు రూ.7,600 కన్నా తగ్గే పరిస్థితి లేదని చెబుతున్నారు. నాగులపల్లి, ఇందూరు, గోపాల్‌పూర్, మంబాపూర్ మారేపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పత్తిని విక్రయించేందుకు మొగ్గు చూపడం లేదు. ఎకరాలో కనీసం 8నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈసారి ఎక్కడా ఐదు క్వింటాళ్లకు మించలేదని చెబుతున్నారు. కూలీ, మందుల ధరలు పెరగడంతో చేసిన కష్టం పెట్టుబడులకే సరిపోతుందని చెబుతున్నారు. క్వింటాలుకు కనీసం రూ.10 వేలు చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుందని, లేదంటే నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా పత్తి నిల్వలు లేక మిల్లులు వెలవెలబోతున్నాయి.



తాండూరులోని మెథడిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

రూ.50 లక్షలతో క్రైస్తవ భవన్

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే వేడుకలు

తాండూరు టౌన్: క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తానని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని స్థానిక మెథడిస్ట్ చర్చిలో జరిగిన ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతియుత సమాజం కోసం, సన్మార్గ జీవనాన్ని మానవ జాతికి తెలియజేయడం కోసం యేసుక్రీస్తు శిలువనెక్కి ప్రాణత్యాగం చేశారన్నారు. తాండూరులో రూ.50 లక్షలతో క్రైస్తవ భవన్‌తో పాటు మండలంలో రూ.33 లక్షలతో 16 ప్రార్థనా మందిరాలు, యాలాల మండలంలో రూ.16 లక్షలతో నాలుగు ప్రార్థనా మందిరాలను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటి నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, నాయకులు శ్రీనివాసాచారి, సుధాకర్, హరిహర గౌడ్, వెంకట్‌రెడ్డి, డేవిడ్, ఎబినైజర్ తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

లేట్‌గా లేచారని.. టిఫిన్ బంద్

- బీసీ బాలికల హాస్టల్‌లో వార్డెన్ నిర్వాకం
- ఆకలితో అలమటించిన 30 మంది విద్యార్థినులు
- మధ్యాహ్నం వరకు ఖాళీ కడుపుతో అవస్థలు
- సొమ్మసిల్లి పడిపోయిన పలువురు బాలికలు

బషీరాబాద్: ఆలస్యంగా నిద్రలేచారనే కారణంతో విద్యార్థులకు టిఫిన్ పెట్టలేదు. దీంతో సుమారు 30 మంది మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఆకలితో అలమటించారు. కొంతమంది ఏడ్చుకుంటూ రోడ్డుపైకి వచ్చారు. ఈ ఘటన మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బషీరాబాద్‌లోని బీసీ బాలికల హాస్టల్‌లో 5నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 60 మంది విద్యార్థులున్నారు. వార్డెన్ తీరు నచ్చక 30 మంది ఇళ్లకు వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా శుక్రవారం సెలవు కావడంతో ఉదయం 8 గంటలకు నిద్రలేచారు. అప్పటికే అక్కడికి వచ్చిన వార్డెన్ శశికళ వర్కర్లమీద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు నిద్రలేవని పిల్లలకు టిఫిన్ పెట్టొదని ఆదేశించారు. ట్యాంకు నుంచి వచ్చే నీటి సప్లయ్‌ని కూడా ఆపేయించారు. ఒక్క రోజు పనిష్మెంట్ ఇస్తే కానీ రేపటి నుంచి త్వరగా లేవరు.. ఎవరికీ టిఫిన్, భోజనం పెట్టొద్దు అని కుక్‌ను ఆదేశించారు. అయితే అప్పటికే స్నానాలు చేసిన ఐదుగురు విద్యార్థినులకు టిఫిన్ వండిన కుక్ వారికి మాత్రమే వడ్డించారు. మిగతా వారికి వంట చేయలేదు. ఉదయం 11.30 దాటినా టిఫిన్ లేకపోవడంతో కొంతమంది బాలికలు సొమ్మసిల్లిపోయారు. దీంతో పలువురు విద్యార్థినులు తమ వద్ద ఉన్న బిస్కెట్ ప్యాకెట్లను వారికి ఇచ్చారు. మిగిలిన విద్యార్థులు గేటు వద్ద నిలబడి రోదించారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక నాయకులు పవన్ ఠాకూర్, సాయిలుగౌడ్ ఫోన్ ద్వారా ఎంపీడీఓ రమేశ్‌కు తెలిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన దీనంగా ఏడుస్తున్న పిల్లలను చూసి చలించిపోయారు. లేట్ లేచామని వార్డెన్ టిఫిన్ పెట్టలేదని బోరున విలపించారు. స్నానాలు కూడా చేయకుండా నల్లాలు బంద్ చేయించారని వాపోయారు. వార్డెన్ భర్త రవి తమ గదుల్లోకి వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తాడని ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీఓ అక్కడున్న వర్కర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే వంట చేయించి 12.30 గంటలకు భోజనం పెట్టించారు. విషయం తెలుసుకుని హాస్టల్‌కు చేరుకున్న వార్డెన్ శశికలపై మండిపడ్డారు. వేసవి కాలంలో పిల్లలకు అన్నం పెట్టకుండా హింసిస్తారా..? మీ పిల్లలైతే ఇలాగే చేస్తారా..? అని నిలదీశారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేందర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



అల్పాహారం అందించకపోవడంతో హాస్టల్‌లో దీనంగా నిలబడిన విద్యార్థులు



హాస్టల్‌ను సందర్శించి వార్డెన్ శశికళపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎంపీపీ కరుణ

భయం ఉండాలనే..

ఈ విషయమై వార్డెన్ శశికలను అడగగా పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నందున ఉదయం 4గంటలకే నిద్రలేపి చదివిస్తున్నామన్నారు. అయితే శుక్రవారం ఉదయం 8 గంటలైనా నిద్రలేవని వారిని చూసి.. ఇలాగైతే ఎలా పాసవుతారని మండిపడ్డట్లు తెలిపారు. కొంత భయం ఉండాలనే ఉద్దేశంతో వారికి టిఫిన్ పెట్టొదని వంట మనిషికి చెప్పిన మాట వాస్తవమేనని, పిల్లలు ఇంత ఇష్యూ చేస్తారనుకోలేదని చెప్పారు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న ఎంపీపీ కరుణ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వార్డెన్ శశికళపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేసీఆర్‌ను ఎదుర్కోలేక.. లీకేజీ రాజకీయాలు

- దొంగలను లోపలేస్తేనే పరీక్షలు ప్రశాంతంగా సాగుతాయి
- పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసే నాయకుడు కేసీఆర్ మాత్రమే
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి

తాండూరు రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేక.. బీజేపీ నేతలు లీకేజీ రాజకీయాలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఎద్దేవా చేశారు. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద బీఆర్‌ఎస్ తాండూరు మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. పదో తరగతి ప్రశ్నపత్రాన్ని లీక్ చేసి వాట్సాప్‌లో ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. బీజేపీ నాయకులకు నైతిక విలువలు లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల జీవితాలతో ఆడుకోవద్దని హితవు పలికారు. పేపర్ లీక్ చేసిన దొంగలను లోపలేస్తేనే పరీక్షలు ప్రశాంతంగా పూర్తవుతాయని తెలిపారు.

పాలమూరు బాధ్యత కేసీఆర్‌దే..

పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసే నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని మంత్రి తెలిపారు. ఇది పూర్తయితే తాండూరు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్

భవిష్యత్ రోహిత్‌రెడ్డిదే..

తాండూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి మంచి భవిష్యత్తు ఉందని మంత్రి సబితారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి తాండూరుకు రూ.137 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఘనత రోహిత్‌కే దక్కిందన్నారు. రూ.50 కోట్ల మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కూడా తీసుకువచ్చాడని తెలిపారు. తాండూరు బిడ్డగా ఆయనను అభినందిస్తున్నానని స్పష్టంచేశారు. పట్టణంలోని పాలిషింగ్ యూనిట్ల ద్వారా వెలువడుతున్న కాలుష్య సమస్యను పరిష్కరించేందుకు మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి ఇండస్ట్రియల్ పార్కు మంజూరు చేయించాడని వెల్లడించారు. తాను తాండూరుకు వస్తే.. తన తల్లిదండ్రులు గుర్తుకు వస్తారని తెలిపారు. ఇక్కడి ప్రజలు మరోసారి రోహిత్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఆత్మీయంగా సమ్మేళనాలు..

తాండూరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని వికారాబాద్ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసే వరకూ ఇదే ఊపును కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

గత పాలకుల నిర్లక్ష్యమే

గత పాలకులు నిర్లక్ష్యంతోనే తాండూరు అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీని తెలంగాణ నుంచి తరిమేసే వరకూ పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు తెలిపారు. కార్యక్రమంలో విద్యా మౌలిక సదుపాయాలయ సంస్థ మాజీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, నాయకులు రాందాస్, ఉమాశంకర్, నరేందర్‌రెడ్డి, రాంలింగారెడ్డి, శకుంతల, రఘునాథ్‌రెడ్డి, ఆర్‌సీ గౌడ్, రాకేశ్‌గౌడ్, జగదీశ్, హసీన్ పటేల్, సందీప్‌రెడ్డి, అంతారం రాములు, కుర్వ నాగర్జున పాల్గొన్నారు.

కౌన్సిలర్‌గా గెలవనోడికి.. ఎమ్మెల్యే టికెట్ వస్తదా?

'వికారాబాద్ పట్టణంలో కౌన్సిలర్‌గా గెలవనోడికి (శుభప్రద్ పటేల్‌ను ఉద్దేశించి).. బీఆర్‌ఎస్ తాండూరు టికెట్ వస్తదా'..? అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వికారాబాద్‌కు చెందిన ఓ నాయకుడు ఇటీవల తాండూరులో విస్తృతంగా పర్యటిస్తున్నాడని, పార్టీ టికెట్ సైతం తనకే వస్తుందని ప్రచారం చేసుకుంటున్నాడని మండిపడ్డారు. ఇలాంటి ప్రకటనలతో పార్టీకి నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సబితారెడ్డి ఎదుటే.. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌ను కోరారు. తాండూరులో వర్గపోరును కట్టడి చేసి, పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు.

క్లుప్తంగా

'కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం'

దోమ: కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గూడూరులో కాంగ్రెస్ నేత ముట్పూరి కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో రామ్మోహన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని స్థానిక ఎంపీటీసీ జంగారెడ్డితో కలిసి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలతో పాటు కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టాలు వచ్చినా ఆదుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు యాదవరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, సంఘం నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెన్‌గేస్పూర్‌లో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు యువజన సంఘం సభ్యులు అంబేడ్కర్ చిత్ర పటం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

25 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

ఇబ్రహీంపట్నం: హనుమాన్ ట్రోఫీ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు హిందూవాహిని ఇబ్రహీంపట్నం శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. బాగ్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, అంజానాపూర్, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, మహేశ్వరం, మాడ్గుల మండలాల నుంచి ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. 15వ తేదీలోపు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉప్పరిగూడ లేక్ విల్లా వద్ద ఈ పోటీలను నిర్వహిస్తామని వివరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.55,555, రూ.22,222, రూ.11,111 అందజేయనున్నట్లు తెలిపారు.

కారు చోరీ నిందితుల కోసం గాలింపు

పహాడీషరీఫ్: క్యాబ్ డ్రైవర్‌పై దాడి చేసి కారు అపహరించిన ఘటనలో నిందితుల జాడ కోసం పహాడీషరీఫ్ పోలీసులు రెండు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 6న తెల్లవారుజామున ఎల్.బి.నగర్ క్యాబ్ బుక్ చేసుకొని పహాడీషరీఫ్‌లో డ్రైవర్ మీర్జా ఆజం బేగ్‌పై కత్తితో దాడికి పాల్పడి కారును అపహరించారు. ఇద్దరు నిందితులు బేగం బజార్‌లో కారు వదిలి వెళ్లిన నేపథ్యంలో సీసీ కెమెరాల ఆధారంగా చర్యలు చేపట్టారు. నిందితులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

జాతీయ పురస్కారానికి 'కాన్హా'

నందిగామ: మండల పరిధిలోని కాన్హా గ్రామ పంచాయతీ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైనట్లు ఎంపీడీఓ బాల్‌రెడి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణం, ప్రకృతి విభాగంలో తెలంగాణ నుంచి కార్బన్ న్యూట్రల్ విశేష్ పంచాయతీ పురస్కారానికి కాన్హా పంచాయతీని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా మూడు పంచాయతీలు ఈ పురస్కారానికి ఎంపిక కాగా మన రాష్ట్రం నుంచి కాన్హా పంచాయతీ ఎంపిక కావడంపై గ్రామ సర్పంచ్ సరిత, ఉప సర్పంచ్ మధుసూదన్ హర్షం వ్యక్తం చేశారు.

అక్షరాలు నేర్చుకునేదెలా?



సాక్షరభారత్ కేంద్రంలో చదువుకుంటున్న మహిళలు (ఫైల్)

- ఆగిపోయిన సాక్షరభారత్
- ప్రారంభం కాని కొత్త పథకాలు
- నిరక్షరాస్యత నిర్మూలన ఎలా?

దౌల్తాబాద్: నిరక్షరాస్యతను నిర్మూలించాలనే ఉద్దేశంతో గతంలో ప్రభుత్వం సాక్షరభారత్ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఆయా గ్రామాల్లో సాక్షరభారత్ కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామానికి కోఆర్డినేటర్లు కూడా నియమించారు. ఈ కేంద్రాల్లో నిరక్షరాస్యులు చదువుకునేవారు. ఈ సాక్షరభారత్ పథకాన్ని ప్రభుత్వం 2018లో ఆపేసింది. మండలంలో నిరక్షరాస్యులు గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. ఆయా గ్రామాల్లో చాలా మంది చదువును మధ్యలోనే ఆపేశారు. సాక్షరభారత్‌తో కొంతమేరకు చదువుకుని ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ప్రస్తుతం సాక్షరభారత్‌ను ఆపేయడంతో నిరక్షరాస్యులు అలాగే ఉండిపోయారు. కొత్తగా నవభారత్ సాక్షర అనే కార్యక్రమాన్ని తీసుకొస్తామని గతేడాది ప్రకటించినా ఇప్పటివరకు స్పష్టమైనా ప్రకటన చేయలేదు. దీంతో సాక్షరభారత్ పథకానికి మంగళంపాడింది.

నిలిచిన అమ్మ నాన్నల చదువు..

సాక్షరభారత్ పథకం 2009న ప్రారంభమైంది. తొమ్మిది సంవత్సరాల తరువాత 2018లో సాక్షరభారత్‌ను ప్రభుత్వం ఆపేసింది. కేంద్రం నుంచి నిధులు నిలిచిపోవడంతో ఈ పథకానికి స్వస్తి చెప్పారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పించాలని సూచించారు. ఇందుకోసం పిల్లలు, ఉపాధ్యాయులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు.కరోనా రావడంతో పథకం జాడేలేదు.

మహిళలే ఎక్కువ..

మహిళల అక్షరాస్యత పెంపుపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మండలంలో నిరక్షరాస్యుల్లో అధికభాగం అతివలే ఉన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం వయోజన విద్య, అక్షరకిరణం కార్యక్రమాలను చేపట్టింది. తర్వాత సాక్షరభారత్‌ను చేపట్టింది. ఈ కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఖాళీగా ఉన్న సమయాల్లో సాయంకాల సమయాల్లో కొంత వరకు విద్యను నేర్చుకోగలిగారు. ప్రభుత్వాలు దృష్టి సారిస్తే మహిళల్లో నిరక్షరాస్యత రేటును తగ్గించవచ్చు.



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

గ్రామగ్రామాన అభివృద్ధి పనులు

- కొడంగల్ నియోజకవర్గానికి అధిక మొత్తంలో నిధులు
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ : నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నీటూరు గేటు నుంచి అంగడి రాయిచూర్ గ్రామం వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రెండు గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కౌన్సిలర్ మధుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, భీములు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కోస్గిలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 10న కోస్గిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ గ్రామాన పర్యటించి ప్రతి ఇంటిపై బీఆర్‌ఎస్ జెండా ఉండేవిధంగా చూడాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తట్టెపల్లిని మండలం చేయాల్సిందే

సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు



దీక్షలో సాధన కమిటీ నాయకులు

పెద్దేముల్: కర్ణాటక సరిహద్దులో ఉండి అభివృద్ధిలో వెనుకబడిన తట్టెపల్లి ప్రాంతాన్ని మండలంగా ప్రకటించాలంటూ శుక్రవారం మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. సాధన కమిటీ ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి అంజయ్యలు మాట్లాడుతూ ఏడాది నుంచి మండలం కోసం పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రకటించే వరకు దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. మండలం కోసం మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలకు పలు మార్లు విన్నవించామన్నారు. కర్ణాటక సరిహద్దుకు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న తట్టెపల్లి పరిధిలోని గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. గ్రామాల్లో కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం వైద్యానికి కూడా నోచుకోవడంలేదని తెలిపారు. రాష్ట్ర సరిహద్దులోని కుంచారం, షాదీపూర్ గ్రామాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించి మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎర్రగోడుతండా సర్పంచ్ శంకర్, పీఏసీఎస్ మాజీ డైరక్టర్ ప్రభుకుమార్, మాజీ ఎంపీటీసీ గెమ్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ సర్పంచ్ వెంకటేశం, నాయకులు రాజ్‌కుమార్, డీలర్ అంజయ్య,రాజు, రవిరాథోడ్, రూప్‌సింగ్, పండరి, జైపాల్, గోపాల్ పాల్గొన్నారు.

'తపాలా' వడ్డీ పెరిగింది

- పోస్టల్ పథకాలపై వడ్డీ రేట్లు పెంచిన కేంద్రం
- మహిళలు, ఆడపిల్లలకు నూతన పొదుపు పథకం



కొడంగల్ పోస్టాఫీసు కార్యాలయం

కొడంగల్ రూరల్: తపాలా శాఖ నిర్వహిస్తున్న పలు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు పెంచింది. పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కలిగేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ఏప్రిల్ నుంచి జూన్ వరకు వడ్డీ రేట్లు పెంచడమే కాకుండా ఎంపిక చేసిన పొదుపు పథకాలకు పరిమితి కూడా పెంచారు. నూతన వడ్డీరేట్లు, కొత్త పథకాలపై అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మధ్య తరగతి వర్గాలకు ఈ పథకాలపై అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న తపాలా అధికారులు తమ పరిధిలోని జనాలకు అవగాహన కల్పిస్తున్నారు.

పరిమితి పెంపు.. వడ్డీలో మార్పు

సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో అత్యధిక పొదుపును రూ.15 లక్షల నుంచి రూ.30లక్షలకు పెంచారు. అంతేకాక ఈ పథకంలో మూడు నెలలకోమారు వడ్డీ తీసుకునే సౌకర్యం కూడా కల్పించారు. అలాగే నెలవారీ ఆదాయ పథకం వ్యక్తిగత ఖాతాలో అత్యధిక పొదుపును రూ.4.5లక్షల నుంచి రూ.9లక్షలకు పెంచారు. ఈ పథకంలోనూ నెల నెలా వడ్డీ పొందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ -2023 పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారు. మహిళలు, ఆడ పిల్లల కోసం వన్‌టైం స్మాల్ సేవింగ్ స్కీంగా దీనిని రూపొందించారు. ఈ పథకంలో 2025వరకు చేరే అవకాశం కల్పించారు. ఈ పథకంలో 2లక్షల వరకు పొదుపు చేసుకునే అవకాశం ఉందని, రెండేళ్ల కాలపరిమితిలో పాక్షికంగా నగదు ఉపసంహరణ చేసుకునే వెసలుబాటు ఉందని పేర్కొంటున్నారు.

పథకాల వారీగా వడ్డీ రేట్ల వివరాలు..

పొదుపు ఖాతా	వడ్డీ శాతం
సేవింగ్స్ అకౌంట్స్	4
రికరింగ్ డిపాజిట్	6.2
మంత్లీ ఇన్‌కం స్కీం	7.4
టైం డిపాజిట్ (ఏడాదికి)	6.8
రెండేళ్లు	6.9
మూడేళ్లు	7
ఐదేళ్లు	7.5
సుకన్య సమృద్ధి యోజన	8
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7
సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్	8.2
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.7
కిసాన్ వికాస పత్రం	7.5

అధిక వడ్డీ పొందే వీలుంది



పొదుపు పథకాలపై తపాలా శాఖ అధిక వడ్డీ చెల్లిస్తోంది. వివిధ వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు పరిమితి సైతం పెంచారు. తపాలా శాఖలో పొదుపు పథకాల్లో చేసిన మార్పులతో ప్రజలకు లబ్ధిచేకూరుతుంది. పథకాలతో చేకూరే ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం.

– వి.హన్మంతు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తపాలా సూపరింటెండెంట్

కడుపు నొప్పి భరించలేక..

- పురుగు మందు తాగి రైతు బలవన్మరణం



నర్సింహులు (ఫైల్)

పెద్దేముల్: కడుపునొప్పి భరించలేక పురుగు మందు తాగి రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండపల్లికి చెందిన నాగసారం నర్సింహులు(48) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎక్కడ చూపించిన తగ్గకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టు మార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

హామీలు అమలు చేయరేం



హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో ప్రవీణ్‌యాదవ్, నాయకులు

- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు
- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌యాదవ్

కేశంపేట: ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి అలుగడ్డ ప్రవీణ్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, కేశంపేట, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం గ్రామాల్లో శుక్రవారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయన్నారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలేదన్నారు. జీఎస్టీ కారణంగా 23 కోట్ల మంది పేదరికంలోకి వెళ్లారని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇస్తామని హామీ ఏమైందని మండిపడ్డారు. రుణమాఫీ సైతం అటకెక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడం వలన 8 వేల మంది రైతులు మృతి చెందారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్ అందిస్తామని అన్నారు. పెట్రోల్, డిజిల్ ధరలను తగ్గిస్తామని చెప్పారు. నిరుపేదలకు ఇండ్లతో పాటు రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్తకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

విద్యార్థి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: పరీక్షలు రాయాలని తల్లిదండ్రులు మందలించడంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామానికి చెందిన బంగారి పెంటయ్య కుమారుడు బంగారి రాజేశ్ (15) నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా బడికి వెళ్లకుండా, పరీక్షలు రాయకుండా తిరుగుతున్నాడు. దీంతో పరీక్షలు రాయాలని తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేష్ ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగువారు చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్

నందిగామ: న్యాయ శాస్త్రాన్ని అభ్యసించే విద్యార్థులు చట్టలపై అవగాహన పెంచుకోవాలని సుప్రీం కోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడ శివారులో సింబాయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలోని న్యాయ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మూట్ కోర్టు కాంపిటేషన్ కు పినాకి చంద్రఘోష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని పలు ప్రాంతాలలోని 21 లా కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచేందుకు ఈ మూట్ కోర్టు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. లా విద్యార్థులు దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చట్టాలపై అవగాహన కల్గిండాలని, దీంతో పాటు పలు న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి విజయ్ సేన్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్, డిప్యూటీ డైరెక్టర్లు అనేరాధ, అభిలాష్, అక్షిక ప్రధాన్, మూట్ కోర్టు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రొఫెసర్లు

కనులపండువగా బాలాజీ బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



ఎడ్లబండిపై ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి..

- ఎడ్లబండిపై ప్రదక్షిణలు చేసిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం కల్మన్‌కాల్వ గ్రామంలో బాలాజీ బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా కొనసాగాయి. శుక్రవారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం శకటోత్సవం వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొని ఎడ్లబండి ఎక్కి ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాయంత్రం స్వామివారికి చక్రస్నానం చేపట్టడంతో ఉత్సవాలు ముగిశాయి. ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి మాట్లాడుతూ.. పురాతన చరిత్రగల ఆలయ ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రతీ ఒక్కరూ భక్తిభావాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మరికల్ సర్పంచ్ పాండురంగయ్య, కుల్కచర్ల మండల రైతుబంధు అధ్యక్షుడు రాజు, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.